క్లుప్తంగా

ఉపాధి కార్యాలయ ఆవరణలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ ఆవరణలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.సుధ(టెక్నికల్) దీనిని ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయానికి వీల్ ఛైర్స్ అందించినట్లు సుబ్బిరెడ్డి తెలిపారు.

చిన్నారులకు డ్యాన్స్‌లో శిక్షణ



శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: బున్నీ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ లోని చిన్నారులకు డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తున్నట్లు కొరియోగ్రాఫర్ బున్నీ శుక్రవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆసక్తి గల చిన్నారులకు రాక్, డిస్కో, వెస్ట్రన్, ఫోక్ డ్యాన్స్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. డ్యాన్స్‌తోపాటు చిత్రలేఖనం, మ్యూజిక్‌ల్లో కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు 89787 51234 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

త్వరితగతిన పార్కు పనులు పూర్తి



పార్క్‌లో పర్యటిస్తు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్ పార్క్‌ను వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, ఏడీహెచ్ దామోదర్ శుక్రవారం సందర్శించారు. పార్క్‌లో పచ్చదనం, పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేశారు. దామోదర్ మాట్లాడుతూ పచ్చదనానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ రక్షణ గోడ ఎత్తు పెంచాలని, మరుగు దొడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పీఎల్అండ్‌సీ డీఈ ప్రసాద్‌కు కోరారు. ఈ పనులు జూన్ 5 న పర్యావరణ దినోత్సవం నాటికి పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నక్క దుర్గబాబు

పెదగంట్యాడ: గ్రామ అభ్యుదయ సేవా సంఘం సీతానగరం గ్రామ కమిటీ అధ్యక్షునిగా నక్క దుర్గబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 75వ వార్డు సీతానగరంలో శుక్రవారం ఈ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షునిగా నక్క సింహాచలం, కార్యదర్శిగా పల్లా హరిబాబు, కోశాధికారిగా పంచదార్ల అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా మురుకుతి అప్పలనాయుడు, నంబారు సన్యాసిరావు, కార్యనిర్వహణ అధ్యక్షునిగా ఓడిబోయిన అప్పలరాజు ఎన్నికయ్యారు. ఉప కోశాధికారిగా ఎర్రబెల్లి శంకర్, ఉప కార్యనిర్వహణ అధ్యక్షునిగా అనిపెద్ది గోపాలదాసు, సంయుక్త కార్యదర్శిగా నమ్మి చిన్నారావును, సభ్యులుగా పెద్దాడ వెంకటేష్, మొల్లి అప్పలరాజు, యలమంచిలి శివరామకృష్ణ, వాతాడ వీర్రాజు, సర్వసిద్ధి ముత్యాలు, నాత్ర శ్రీనును ఎన్నుకున్నారు.

మీ భద్రత.. మా బాధ్యత

- వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- విస్తృతంగా వాహన, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- నిబంధనలు మీరిన వారికి జరిమానాలు



దృశ్య, శ్రవణ వాహనం స్క్రీన్‌పై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న సీఐ మళ్ల అప్పారావు(ఫైల్)

మర్రిపాలెం: వాహన చోదకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించేలా చూస్తూ.. కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారిపై కొరడా ఝులిపిస్తూ.. మళ్లీ అలా చేయకుండా వారికి సూచనలిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వాహన చోదకులకు రకరకాల పద్ధతుల అవగాహన కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపడుతున్నారు. ప్రధాన కూడళ్లలో రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తున్నారు. నెలకు కనీసం 20 సార్లు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు.

డ్రంకర్స్‌పై ప్రత్యేక నిఘా..

మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఏకధాటిగా ప్రతి రోజు రాత్రి ప్రధాన రహదారులు, బీఆర్‌టీఎస్ రోడ్లల్లో గస్తీ నిర్వహించి వీరిని పట్టుకుంటారు. తాగి వాహనం నడపడం వల్ల అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్న ఘటనల వల్ల ప్రతి రోజూ నిఘా పెంచుతూ గస్తీ కాస్తున్నారు. తనిఖీల్లో మందుబాబులు దొరికితే అవగాహన కల్పించి కేసులు నమోదు చేస్తున్నారు.

ఈ ఏడాది ఇప్పటి వరకు 390 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కట్టి వారిని కోర్టుకు అప్పజెప్పారు. వీరికి కోర్టు జరిమానాలు విధించింది. ఇందులో 352 మంది నుంచి రూ.5,67,400 జరిమానాలు వసూలు చేశారు. మిగతావారు ఇంకా కట్టాల్సి ఉంది.

అన్ని రకాల వాహనాలపై..

ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 10 వరకు ఉన్న వ్యవధిలో 21,886 మందిపై అంటే ట్రాఫిక్ రూల్స్ పాటించని ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, లారీలు తదితర వాహనాలపై కేసులు నమోదు చేశారు. వారికి మొత్తం కలిపి చలానాల ద్వారా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు రూ.54,79,510 ఫైన్లు విధించారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, ఆటోలో ఓవర్ లోడ్, కార్లలో సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం తదితర కేసులు అధికంగా నమోదయ్యాయి. ఇందులో కొందరు స్పాటులోనే యాప్ ద్వారా జరిమానాలు చెల్లించారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి మిగిలిన వారితో కట్టిస్తున్నారు.

> ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 21,886 మందిపై కేసులు.
> రూ.54,79,510 జరిమానాల వసూలు.
> 390 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు.
> రూ.5,67,400 జరిమానాల వసూలు

రాంగ్ పార్కింగ్.. డేంజరస్ డ్రైవింగ్

రాంగ్ పార్కింగ్ చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతుబజారుకు వెళ్లి వచ్చే వారి సంఖ్య ఎక్కువ. అక్కడ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ కోసం ఒక వరుస వరకు అనుమతిస్తున్నారు. వాహనదారులు ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఒకదాని వెనుక మరో వాహనం పార్క్‌చేస్తున్నారు. అలా నిబంధనలు ఉల్లంఘించిన 3,643 మందిపై జరిమానాలు విధించారు. డేంజరస్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు మీద న్యూసెన్స్ చేస్తున్న 351 మందికి జరిమానా మోత వడ్డించారు.

హెల్మెట్ ధరించని వారు..

ఈ ఏడాది ఇప్పటి వరకు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన 13,480 మందికి ఫైన్లు విధించారు. గతేడాదిలో హెల్మెట్ లేకుండా ప్రయాణించి 147 మంది మృతి చెందారని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపి ప్రమాదాలకు దూరంగా ఉండాలని పోలీసులు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు. మానవతా దృక్పథంతో కుటుంబాలను గుర్తు చేస్తూ.. దృశ్య, శ్రవణ వాహనాల ద్వారా గతంలో జరిగిన ప్రమాదాలను



హెల్మెట్ ధరించమని వాహనచోదకుడికి ప్లకార్డు చూపిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు(ఫైల్)

ప్రదర్శిస్తూ యువతకు సూచనలిస్తున్నారు. ఈ ఏడాదిలో ఫుట్‌పాత్‌లు, రోడ్లు, ఇతరత్రా ప్రదేశాలను ఆక్రమిస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్న 116 మందిపై కేసులు బనాయించారు.

ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు సూచనలు

ఆటో డ్రైవర్లు మోతాదుకు మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, డ్రైవర్ సీట్లో పక్కనే కూర్చోపెట్టుకోవడం, ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపివేయడం వంటి వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఫైన్లు వేస్తున్నారు. వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తూ కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తూ ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు బాధ్యతగా వ్యవహరించి నిబంధనలు ఉల్లంఘించకుండా నడుచుకుని పోలీసులకు సహాయపడి వారి జీవితాలను కాపాడుకోవాలని కోరుతున్నారు.



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు(ఫైల్)

అమ్మవార్లను దర్శించుకున్న మళ్ల విజయప్రసాద్



మళ్ల విజయప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెంలో కొలువైన దుర్గాలమ్మ, బంగారమ్మ అమ్మవార్లను శుక్రవారం రాష్ట్ర విద్యా సంక్షేమ మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మళ్ల విజయప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి, నమ్మి శ్రీను, యల్లపు వెంకటేశ్వరరావు, దొడ్డి సతీష్, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఐయామ్ ఏ నర్స్' పాట విడుదల

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎంఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అన్నీ ప్రేమజ ఆదిశర్ల రూపొందించిన 'ఐయామ్ ఏ నర్స్'పాట విడుదలైంది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె ఈ పాటను విడుదల చేశారు. కేజీహెచ్‌లో 38 ఏళ్ల పాటు నర్సింగ్ వృత్తిలో కొనసాగి రెండేళ్ల కిందట నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేసిన తన తల్లి ఎవాంజెలిన్ ఎస్తేర్‌కు ఈ పాటను అంకితం ఇస్తున్నట్లు ప్రేమజ తెలిపారు. ప్రతీ ఒక్కరి జీవితంలో నర్సుల పాత్రను తెలియజేస్తూ రూపొందించిన ఈ పాట అందర్నీ ఆకట్టుకుంటుందన్నారు. ఈ పాటకు సాహిత్యం తానే అందించానని, సూరజ్ గిప్సన్ సంగీతం, మనోహర్, పీటర్ వీడియో ఎడిటర్లుగా సహకారం అందించారని చెప్పారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం సామాజిక భవనంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో పాటలు, నృత్య ప్రదర్శనలు, పేపర్ క్రాఫ్ట్, బొమ్మల తయారీ, మ్యాజిక్ షో మొదలైన వాటిపై తర్ఫీదు ఇస్తున్నట్లు వీసీసీ మల్కాపురం ఓన్ కన్వీనర్ ఈ.అరుణ తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు అరుణ తెలిపారు. క్రాంతినగర్, దుర్గానగర్, గుడివాడఅప్పన్నకాలనీ, గుల్లలపాలెం, నెహ్రూనగర్ ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో చాతుర్య, చిన్మయ్, అహళ్య, సంగీత, సాయి పాల్గొన్నారు.



వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ మేళా

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ మేళా జరిగింది. విశాఖ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థ అయిన హెచ్‌సీఎల్‌లో టెక్ బీ ప్రవేశాలకు ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. జిల్లా నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులుగా గుర్తించారు. ఈ ఇంటర్వ్యూల్లో 11మంది అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ మేనేజర్ అనీల్, క్లస్టర్ మేనేజర్ సాయి కిరణ్, యుగేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు

'ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం కానివ్వం'

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 820వ రోజు శుక్రవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామనే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైనా ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

15 రోజులకోసారి మండలస్థాయిలో స్పందన

- రెవెన్యూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలం: మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి స్పందన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పెందుర్తి మండలంలో నెలలో రెండు శుక్రవారం రోజుల్లో స్పందన నిర్వహిస్తామని చెప్పారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు నెలలో రెండుసార్లు పదిహేను రోజులకోసారి విశాఖలోని ఆరు మండలాల్లో స్పందన నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో అధికారులు తీసుకున్న నిర్ణయాలకు అర్జీదారులు తృప్తి చెందకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మండలస్థాయిలో స్పందన పెట్టడం ద్వారా క్లిష్టమైన సమస్యలు ఉన్నవాళ్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాలేనివాళ్లు, వృద్ధాప్యంలో ఉన్నవాళ్లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో స్పందన నిర్వహించడం వల్ల అధికారులు, వీఆర్‌వోలు సిబ్బంది అందుబాటులో ఉండి అప్పటికప్పుడు సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.24 గంటల్లో సమస్య పరిష్కారం అవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. క్లిష్టమైన సమస్యలు సమయానుకూలంగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదన్నారు. పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి పొందేలా సమస్య పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పెందుర్తి తహసీల్దారు ఆనంద్‌కుమార్, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న దేవీసుజాత

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి భక్తులను అలరించింది. మండా సుధారాణి శిష్యురాలు తిరువీధుల దేవీసుజాత తన మృదు మధుర గానంతో అన్నమయ్య, త్యాగరాజ, దీక్షితార్ కీర్తనలు ఆలపించారు. అమ్మ ఆనంద దాయిని, ఏకదంతం, మామ వసదా, పంచాషట్‌పేట, సాదు చరణ, నీలాంబరి, క్షీరాబ్ధికన్యకను కీర్తనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈమెకు హనుమంతు రామచరణ్ వయొలిన్‌పై, ఎం.కామేష్ మృదంగం పై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని సుజాతను అభినందించి సత్కరించారు.

అమ్మవార్లకు విశేష పూజలు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మి దేవి ఆలయంలో, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో వైశాఖ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయాల ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, శ్యామ్ అమ్మవార్లకు విశేష కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వారికి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు సానబోయిన సంపత్‌కుమార్, పల్లా పెంటారావు, వెంకటరావు తదితరులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.



ధనలక్ష్మి దేవికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు



ప్రత్యేక పూజలందుకున్న దుర్గమాంబ

రాష్ట్రస్థాయిలో అగనంపూడి విద్యార్థుల ప్రతిభ

విజేతలకు కలెక్టర్ అభినందన

విశాఖ విద్య: జీవన నైపుణ్యాలు పెంపొందించేలా జిల్లాలోని అగనంపూడి జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు డి.నరేంద్ర, డి.జయంతి రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటికి విద్యార్థులే పరిష్కార మార్గాలు చూపేలా ప్రాజెక్టులను తయారు చేయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,700 ప్రాజెక్టులు రాగా, ఇందులో అగనంపూడి విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గైడ్ టీచర్ పి. కృష్ణవేణిని, ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను వీఎంఆర్‌డీఏలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో సైతం ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

గాడితప్పిన వీధిలైట్ల నిర్వహణ!

సమస్య పరిష్కరించాలని ప్రజల విజ్ఞప్తి



సింథియా నుంచి మల్కాపురం ప్రధాన రహదారిలో వెలగని వీధి లైట్లు

సింథియా: విద్యుత్ దీపాల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇందుకు మల్కాపురం నుంచి సింథియా వరకు ప్రధాన రహదారిపై వీధి దీపాల నిర్వహణే నిదర్శనం. షిప్‌యార్డ్ నుంచి హెచ్‌పీసీఎల్‌కు భారీ యంత్రాలు తరలించే ప్రక్రియలో మల్కాపురం నుంచి సింథియా వరకు ఉన్న డివైడర్ తొలగించారు. దీంతో చీకటి పడిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణమంటే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. మరో వైపు పట్టపగలు దీపాలు వెలుగుతూనే ఉన్నా సంబంధిత అధికారుల వాటిపై దృష్టి సారించడంలేదు. సమస్యలపై జీవీఎంసీ, విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సింథియా సమీపంలో పట్టపగలే వెలుగుతున్న వీధి లైట్లు

ఆకతాయిల ఆగడాలు



మల్కాపురం నుంచి సింథియా రోడ్డులో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. మద్యం తాగి సీసాలతో విద్యుత్ దీపాలు పగులగొడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి వీధిలైట్ల సమస్య పరిష్కరించి, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు వేయాలి.

–మహ్మద్ బషీర్, సింథియా

రాత్రిళ్లు ప్రయాణించలేక పోతున్నాం



మల్కాపురం నుంచి సింథియా ప్రధాన రహదారిలో సాయంత్రం 6 గంటలు దాటితే ప్రయాణించలేకపోతున్నాం. ఈ ప్రాంతంలో వీధి లైట్లు వెలగక చీకట్లో ప్రయాణం చేయాలి. దీనికి తోడు రోడ్డులో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు శ్రుతిమించుతున్నాయి. వీధి దీపాలు వెలిగేలా అధికారులు చర్యలు చేపట్టడంతో పాటు పోలీసులు ఆకతాయిలను నిలువరించే చర్యలు తీసుకోవాలి.

– రవి, చింతల్లోవ

ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం నేడు

సీతంపేట: విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ కళారాధన పీఠం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఎల్.ఎన్.స్వామి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. రంగస్థల నటులు టీకి వీరభద్రాచారి, పసుమర్తి సన్యాసిరావు, సాహితీవేత్తలు సాలిపల్లి మంగామణి, వృద్ధుల కల్యాణ రామారావు, పాత్రికేయులు ఆర్.శివకుమార్, గాయని పల్లా మనోరమ, సేవారంగంలో రాయపల్లి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ అభిమాని బంటు అర్జునరావు, ప్రజా సేవా రంగంలో మోడేకుర్తి సత్యనారాయణ, కూచిపూడి నృత్య కళాకారిణి వాణి పద్మజలకు తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతులమీదుగా పురస్కారాలు అందిస్తామన్నారు.

సేవకు మరో పేరు నర్సులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలందించడంలో నర్సులకు ఎవరూ సాటిరారన్నారు. అనంతరం కేక్ కట్ నర్సులకు పంచిపెట్టారు. రిటైర్ అయిన నర్సులు పి.సరోజిని, బి.సీతలతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన నర్సులు జయప్రద, వరలక్ష్మి, రాజకుమారి, పుష్ప, ఎల్.టి సుందరి సత్కరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హెడ్ నర్సులు డి.లక్ష్మి, పి.వరలక్ష్మి, వి.ఉషారాణి, ఎన్.ప్రశాంతి పాల్గొన్నారు.

విమ్స్‌లో..

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నర్సింగ్ విభాగం ఇన్‌చార్జి రాధ, స్టాఫ్ నర్స్ వి.జ్యోతి, కల్యాణ్, తిరుమల, దుర్గ తదితరులను డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సత్కరించారు. వైద్య రంగంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ భవానీప్రసాద్, ఆర్ఎంవోలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్